సాక్షి
వికారాబాద్
బుధవారం। 22। మే। 2024



అప్పులు చేసి అభివృద్ధి

పంచాయతీ భవనాలు, క్రీడా ప్రాంగణాలు నిర్మించిన మాజీ సర్పంచ్‌లు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



గుట్టుగా గుట్కా దందా!

గుట్కాల విక్రయాలపై నిషేధం ఉన్నా అక్రమార్కులు నిబంధనలు బేఖాతరు చేస్తూ దందా కొనసాగిస్తున్నారు. 8లో▸



దుద్యాలలో సమస్యల తిష్ట

దుద్యాల మండల కేంద్రంలో సమస్యలు తాండవిస్తున్నాయి. కాలువలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న గోపాల్

అనంతగిరి: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ హెచ్చరించారు. మంగళవారం వికారాబాద్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్టాక్ వివరాలను సూచిక బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు విధిగా రసీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి, వ్యవసాయశాఖ మండల అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు శివకుమార్



బహుమతి అందుకుంటున్న శివకుమార్

దౌల్తాబాద్: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన శివకుమార్ అంతర్జాతీయ పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్- 19 విభాగంలో వంద మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. మే 18నుంచి 21వ తేదీ వరకు జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. శివకుమార్ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జూన్ 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గననున్నారు.

రాజీవ్ గృహకల్పలో కార్డన్ సెర్చ్



కాలనీ వాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్పలో మంగళవారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లల్లో ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురి గుర్తింపు కార్డులను పరిశీలించారు. వాహనాల ధ్రువపత్రాలను చూశారు. అనంతరం కాలనీ వాసులతో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల సంరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుంటామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం తప్పనిసరి అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సరైన పత్రాలు లేని 43 బైకులు, 3 ఆటోలు, 4 ఫోర్ వీలర్స్ వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ సీఐ నాగరాజు, ధారూర్ సీఐ రామకృష్ణ, మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

తుర్కయంజాల్: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు సరైన చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన మంగళవారం ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక అంశాలపై అధికారులతో చర్చించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేశ్, జెడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, మహిపాల్, మర్రి నిత్యా నిరంజన్ రెడ్డి, అనురాధ, దశరథ, శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరని రైతు వేదికలు



నిరుపయోగంగా భవనాలు

- సమావేశాలు నిర్వహించని అధికారులు
- సూచనలు, సలహాలు అందక నష్టపోతున్న అన్నదాతలు
- జిల్లాలో రూ.21.34 కోట్లతో 97 భవనాలు
- వినియోగంలోకి తేవాలంటున్న రైతులు

తాండూరు: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన మేర ఫలితం కనిపించడం లేదు. సాగుపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి పంటల సాగుపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. అయితే అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. మరో పక్షం రోజుల్లో వానాకాలం సీజన్ మొదలవుతున్నా పంటల సాగుపై ఎలాంటి సమావేశాలు నిర్వహించకపోవడం గమనార్హం.

ప్రతి క్లస్టర్‌లో ఒక రైతు వేదిక

జిల్లాలో 20 మండలాలు, 525 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రెవెన్యూ గ్రామాలను 97 క్లస్టర్లుగా విభజించారు. ప్రతి క్లస్టర్‌లో ఒక రైతు వేదిక భవనాన్ని నిర్మించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.21.34 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి నెలా రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు అన్నదాతలతో సమావేశం నిర్వహించాలి. పంటల సాగుపై అవగాహన కల్పించాలి. అవసరం అనిపిస్తే శాస్త్రవేత్తలతో సూచనలు, సలహాలు ఇప్పించాలి. కానీ ఏడాదిగా ఇవేవీ జరగడం లేదు. ప్రస్తుత వేసవిలో ఏ ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలం పనులపై దృష్టి సారించారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. కానీ అధికారులు మాత్రం రైతు వేదికల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించ లేదు. వెంటనే సమావేశాలు నిర్వహించి రానున్న వానాకాలంలో ఏయే పంటలు వేయాలో చెప్పాలని రైతులు కోరుతున్నారు.



చెంగోల్‌లో నిరుపయోగంగా రైతు వేదిక భవనం

ఏటా తగ్గుతున్న దిగుబడి

ఇక్కడి ప్రజలు వ్యవసాయం ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో 9.50 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. వానాకాలం సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. ప్రధానంగా పత్తి, కంది, మొక్కజొన్న, వరి, పెసర, మినుము తదితర పంటలు వేస్తారు. సాగు విస్తీర్ణంలో 45 శాతం వరకు పత్తి పంట ఉంటుంది. గత సీజన్‌లో వివిధ కారణాల వల్ల పత్తి దిగుబడులు భారీగా పడిపోయాయి. కంది పంట పరిస్థితి కూడా అలాగే మారింది. గత ఏడాది అధికారుల సూచనలు, సలహాలు అందక రైతులు నష్టపోయారు. ప్రస్తుత సీజన్‌లోనైనా సాగుపై సూచనలు చేస్తారనుకుంటే రైతు వేదికల్లో సమావేశాలే నిర్వహించలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూన్‌లో మెట్రో-2 డీపీఆర్

- కార్యాచరణ వేగవంతం
- ఇప్పటికే ఎయిర్‌పోర్టు మార్గాన్ని ఖరారు చేసిన హెచ్ఎంఆర్
- ఆరు కారిడార్లలో మెట్రో రెండోదశ
- కోడ్ తొలగిన వెంటనే పనులు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండోదశపై అడుగులు వేగంగా పడుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కార్యాచరణ ప్రారంభం కానుంది. నగరంలోని ఆరు మార్గాల్లో నిర్మించనున్న మెట్రో రెండో దశపైన సమగ్రమైన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయనున్నారు. జూన్‌లోనే డీపీఆర్ సిద్ధం చేయనున్నట్లు హెచ్ఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. సిస్టా ఇంజనీరింగ్ సంస్థను డీపీఆర్ రూపకల్పన కోసం కన్సల్టెన్సీగా నియమించిన సంగతి తెలిసిందే. సమగ్రమైన ప్రాజెక్టు నివేదికపైన మంత్రిమండలి ఆమోదం అనంతరం నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టుతో పాటు ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్-బీహెచ్ఈఎల్, రాయదుర్గం-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాగోల్-ఎల్‌బీనగర్, ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రెండో దశప్రాజెక్టు కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గ్రేటర్‌హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన, పరీవాహక ప్రాంతాల అభివృద్ధితో పాటు మెట్రో రెండో దశ ప్రాజెక్టును ఈ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఇందుకనుగుణంగా మెట్రోపైన జూన్ నుంచి పనులను వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మొదట ఎయిర్‌పోర్టు వరకు....

రెండో దశ మెట్రో నిర్మాణంలో భాగంగా మొదట ఎయిర్‌పోర్టు కారిడార్‌ను చేపట్టనున్నారు.ఈ కారిడార్‌లో ఇప్పటికే 14 కిలోమీటర్ల మార్గాన్ని హెచ్ఎంఆర్ఎల్ ఖరారు చేసింది. నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 13 స్టేషన్‌లను నిర్మించనున్నారు.ఈ రూట్‌లో హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఇప్పటికే ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ నిపుణులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.చాంద్రాయణగుట్ట నుంచి ఎయిర్‌పోర్టు వరకు మరో 15 కిలోమీటర్ల రూట్‌లో ఎక్కడెక్కడ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టాలనే అంశంపైన త్వరలోనే స్పష్టత రానుంది.ఎక్కువ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు తక్కువ సమయంలో మెట్రోస్టేషన్‌కు చేరుకొనేవిధంగా స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నాగోల్, ఎల్బీనగర్‌లలో ఇప్పుడు ఉన్న మెట్రో స్టేషన్‌ల నుంచి కొత్తగా నిర్మించనున్న స్టేషన్‌లకు రాకపోకలు సాగించేందుకు స్కైవాక్‌లు, వాక్‌వేలు ఏర్పాటు చేస్తారు. నాగోల్, కామినేని,ఎల్‌బీనగర్,బైరామల్‌గూడ, సాగర్ రింగ్‌రోడ్డు, మైత్రీ నగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట జంక్షన్, ఒవైసీ హాస్పిటల్, డీఆర్ డీఓ, హఫీజ్ బాబా నగర్, తదితర ప్రాంతాలలో మెట్రోస్టేషన్‌లను నిర్మించనున్నారు. చాంద్రాయణగుట్ట వద్ద అతిపెద్ద ఇంటర్‌చేంజ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుంది.మెట్రోస్టేషన్‌ల ఎంపికపైన స్థానిక ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట వరకు, అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు వరకు పూర్తి చేసిన అనంతరం మిగతా కారిడార్‌లపైన దృష్టి సారించే అవకాశం ఉంది.

రెప్పపాటులో మృత్యువు

రసూల్‌పురా: చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన దంపతులపై అకస్మాత్తుగా చెట్టు కూలి మీద పడడంతో భర్త దుర్మరణం పాలయ్యాడు. భార్య తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. ఈ విషాదకర సంఘటన బొల్లారం పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తూంకుంటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి రవీందర్..బొల్లారం పయనీర్ బజార్ ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భార్య సరళకుమారితో కలిసి హోండా యాక్టివాపై బొల్లారం ఆస్పత్రికి వచ్చారు. వాహనం ఆవరణలోకి ప్రవేశించగానే అకస్మాత్తుగా పక్కనే ఉన్న ఓ భారీ వృక్షం కూలి వీరిపై పడింది. ఈ ఘటనలో రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా సరళకుమారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం సరళాదేవిని గాంధీ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి చేరుకున్నారు. సరళకుమారి అనారోగ్యం బారిన పడడంతో చికిత్స కోసం బొల్లారం ఆసుపత్రికి వచ్చారని వారు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఎండిన భారీ వృక్షాన్ని తొలగించినట్లయితే ప్రమాదం జరిగేది కాదని, పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమేనని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి రైతుల వినతి

ఇబ్రహీంపట్నం: కొనుగోలు కేంద్రానికి వడ్లను తెచ్చిన తర్వాత పడుతున్న ఇబ్బందులను, సమస్యలను అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డికి రైతులు ఏకరువు పెట్టారు. దండుమైలారం, రాయపోల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్స్‌తోపాటు వడ్లను తూర్పార బట్టే యంత్రాలు అదనంగా అందజేయాలని కోరారు. లారీలు సమయానికి రాక వడ్ల బస్తాల ట్రాన్స్‌పోర్టు సక్రమంగా జరగడం లేదని వాపోయారు. వర్షాలకు వడ్లు మొలకెత్తుతున్నాయని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు వెంటనే తరలించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సమస్యలపై స్పందించిన భూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులకు రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ పాండురంగం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, డీసీఓ ధాత్రిదేవి, పౌరసరఫరాల అధికారి రాథోడ్, ఎంఏఓ వరప్రసాద్‌రెడ్డి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, రఘు, డీసీఎంఎస్ మేనేజర్ రాజు, సెంటర్ ఇన్‌చార్జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మీనమేషాలు

చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

- నేటికీ ఊసే లేని టెండర్ల ప్రక్రియ
- గత ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తి
- ఈ ఏడాది ఇప్పటివరకు స్పష్టత కరువు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు



షాద్‌నగర్: మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు గత ప్రభుత్వం ఆసరాగా నిలిచింది. వారి జీవనోపాధి కోసం ఏటా ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి చేప పిల్లల పంపిణీపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. దీంతో చేప పిల్లలు పంపిణీ చేస్తారా లేదా అని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని 27 మండలాల్లో మొత్తం నీటి వనరులు ఉన్న చెరువులు, కుంటలు వెయ్యి వరకు ఉన్నాయి. వీటి విస్తీర్ణం సుమారు 15వేల హెక్టార్ల వరకు ఉంటుంది. జిల్లాలో మొత్తం 186 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. మత్స్యకార వృత్తిపై సుమారు 15వేల మంది మత్స్యకారులు, వారి కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నారు. చేపలు పట్టడం, వాటిని విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం 800 చెరువుల్లో రూ.1.33 కోట్ల విలువ చేసే 1.96 కోట్ల చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని ప్రారంభించింది. బొచ్చ, రవ్వ, బంగారు తీగ వంటి రకాల చేప పిల్లలు చెరువుల్లోకి వదిలారు.

ఏదీ టెండర్ ప్రక్రియ?

ప్రతి ఏడాది మే నెలలోనే చేప పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచేది. వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరితే ఆగస్టులో మత్స్యకారులకు ఆ శాఖ అధికారులు వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మే నెల పూర్తి కావస్తున్నా నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చేప పిల్లల కొనుగోలుకు టెండర్ పిలవాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యం చేస్తే నష్టమే

ఏటా జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించేవారు. అప్పటి వరకు వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటాయి. ఆ సమయంలో చేప పిల్లలు వదిలితే అవి మంచిగా ఎదిగేందుకు అవకాశం ఉండటంతో పాటు, ఎదిగిన చేపల విక్రయాల ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా లబ్ధి పొందుతారు. ఆలస్యం చేస్తే చేపలు ఎదగడం కష్టంగా మారుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లలు పంపిణీ చేస్తున్నారని, దీంతో అవి సరిగా ఎదగడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం మత్స్యసహకార సంఘాలకు ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ పథకాన్ని చేపడితే బాగుంటుందనే అభిప్రాయం మత్స్యకారుల నుంచి వ్యక్తమవుతోంది.

పంపిణీకి చర్యలు చేపట్టాలి



ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపట్టాలి. టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి. మత్స్యకారుల సంపద పెంపుపై దృష్టి సారించాలి.

– గుండు సురేష్, అధ్యక్షుడు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం, గూడూరు

ఆదేశాలు రాగానే ..



రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. దీని ఆధారంగా జిల్లా స్థాయిలో టెండర్ ప్రక్రియ ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఉచిత చేప పిల్లల పంపిణీకి చర్యలు చేపడతాం.

– సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి

పాఠశాలల్లో సమస్యలుండొద్దు

- 'అమ్మ ఆదర్శ' పనులను పక్కాగా నిర్వహించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

కొండాస్‌పేట: అమ్మ ఆదర్శ పథకం పనులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని చౌదర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్, పూర్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్12 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం ఉండేలా చూడాలన్నారు. లీకేజీ భవనాలకు మరమ్మతులు చేయించాలని సూచించారు. పూర్యానాయక్ తండా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం చౌదర్‌పల్లి జెడ్పీ హెచ్ఎస్‌ను పరిశీలించి అక్కడ జరిగిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీదేవి, పంచాయతీ డీఈ సుదర్శన్‌రావు, మండల ప్రత్యేకాధికారి, ఎంఈఓ రాంరెడ్డి, హెచ్ఎంలు శ్రీహరిరెడ్డి, రవీందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పనుల్లో వేగం పెంచండి

పరిగి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సయ్యాద్ మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా శక్తి కుట్టు కేంద్రం నిర్వాహకులు విద్యార్థులకు ఏకరూప దుస్తులను తయారు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. దుస్తుల కుట్టీ విషయంలో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఈఈ ఉమేష్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మండల విద్యాధికారి హరిశ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యత: డీఈఓ రేణుకాదేవి

కొడంగల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన పనుల్లో నాణ్యత పాటించాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ పనులు చేపట్టాలన్నారు. జూన్ 5వ తేదీలోపు అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్, సీఆర్‌పీ శ్రీనివాస్, గ్రామస్తులు రాములు, బుగ్గయ్య, వెంకటయ్య, మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి: జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరయ్యాయని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి ఎంఏ సత్తార్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేశామన్నారు. రూ.47 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. పాఠశాలల ప్రారంభం నాటికి అన్ని వసతులు అందుబాటులో ఉండాలన్నారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ రతన్‌సింగ్, ఎంఈఓ వెంకటయ్య, ఉద్యానవన శాఖ అధికారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

24న విత్తమేళా

తలకొండపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారి ఆధ్వర్యంలో విత్తనమేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24న నాగర్‌కర్నూల్‌ జిల్లా పాలెంలో నిర్వహించే ఈ మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించి నాణ్యమైన విత్తన రకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆసక్తి గల రైతులు 24న ఉదయం 10 గంటలకు పాలెం పరిశోధన స్థానంలో నిర్వహించే మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువకుడి అదృశ్యం


విశాల్‌ బందేవార్‌(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన బందేవార్‌ శివాజీ కుమారుడు విశాల్‌ బందేవార్‌(20) హోటల్‌ మేనేజ్‌మెంట్‌ పూర్తి చేశాడు. జీవనోపాధి కోసం నెల క్రితం కారు(టీఎస్‌ 15 ఎఫ్‌డీ 3731)ను కొనుగోలు చేశాడు. ఈ నెల 19న మధ్యాహ్నం బయటికి వెళ్లి వస్తానంటూ కారుతో వెళ్లిన విశాల్‌ తిరిగి రాలేదు. ఫోన్‌ సైతం స్విచ్ఛాఫ్‌ అవ్వడంతో బందేవార్‌ శివాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ప్రభుత్వ భూమిలో రోడ్డు

ధ్వంసం చేయించిన అధికారులు


రోడ్డును ధ్వంసం చేయిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: నెర్రపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్‌ 26లోని ప్రభుత్వ భూమిలో ఫాంల్యాండ్స్‌, వెంచర్లకు వెళ్లేందుకు కొందరు అక్రమంగా మట్టి రోడ్డు వేయించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో మంగళవారం ధ్వంసం చేయించారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, పుష్పలత, ఎస్‌ఐ నాగరాజు తదితరులున్నారు.

ఆయిల్‌ పామ్‌ సాగుతో అధిక లాభాలు

ఉద్యానశాఖ జిల్లా అధికారి కనలక్ష్మి

మంచాల: నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్‌ సాగు చేయాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి కనలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి మాట్లాడుతూ.. చీడ, పీడ లేని పంట ఆయిల్‌పామ్‌ అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయన్నారు. ప్రభుత్వం మొక్కలకు 90శాతం రాయితీ ఇస్తుందన్నారు. డ్రిప్‌ ఇరిగేషన్‌కు 80 నుంచి వందం శాతం వరకు రాయితీ వస్తుందన్నారు. మొక్కలు నాటిన నుంచి నాలుగు సంవత్సరాల వరకు ప్రతీ ఏట ఎకరాకు రూ.4,200 చొప్పున ప్రభుత్వం సాగు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందని వివరించారు. ఎకరాకు ఎనిమిది నుంచి 12 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులకు ఉద్యానశాఖ అధికారులు అవసరమైన సలహాలు ఇస్తూ పంట పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతి శ్రీ, ఏఈఓ సిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్‌ గ్రామంలో బ్రిలియంట్‌ ఇంజనీరింగ్‌ కళాశాల ద్వారం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందనే సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పులు చేసి అభివృద్ధి పనులు

- చెల్లించలేక ఇబ్బందులు
- బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌ల ఎదురుచూపులు



చంద్రాయన్‌పల్లి నూతన పంచాయతీ భవనం

మోమిన్‌పేట: నూతన పంచాయతీ భవన నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు, మన ఊరు మనబడి, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసిన మాజీ సర్పంచ్‌లు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులకు తెచ్చిన అప్పులు కుప్పలుగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవిలో ఉండగా అధికారులు వెంటపడి పనులు చేయించి బిల్లులు రాకుండా ఇబ్బంది పడుతుంటే మాత్రం పట్టించుకునేవారే కరువయ్యారని ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తైతే కొత్తపాలక వర్గాన్ని ప్రాధేయపడాల్సి వస్తుందని వాపోతున్నారు. మండల పరిధిలోని తొమ్మిది నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు అనుమతులు రావడంతో ఎనిమిది పంచాయతీ భవన నిర్మాణాలు పూర్తర్వగా మరొకటి నిర్మాణ దశలో ఉంది. ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధుల నుంచి రూ.20లక్షలు ప్రకటించినా నేటికీ ఏడాది కావస్తున్నా నిధులు విడుదల చేయలేదని మాజీలు పేర్కొంటున్నారు. మన ఊరు–మన బడి కింద 19 పాఠశాలలకు నిధులు మంజూరు చేయగా ఏడు పాఠశాలలు పూర్తి చేశామని మరో 12 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వాటిని సర్పంచులే చేయాలని ఉన్నాతాధికారులు పట్టుబట్టి చేయించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 20 శాతానికి మించి నిధులు విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు 42 పనులు మంజూరు చేయగా 42 పనులు పూర్తి చేశామన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ కింద రూ.320 లక్షలు మంజూరైనా నిధులు విడుదల కాలేదన్నారు. క్రీడ ప్రాంగణం ఏర్పాటుకు పంచాయితీకి రూ.1లక్షకు పైగానే ఖర్చు చేసినా ప్రభుత్వం రూపాయి కూడ ఇవ్వలేదన్నారు. పనులు చేసేందుకు లక్షలలో అప్పులు చేయడంతో వడ్డీలు కుప్పలుగా పేరుకుపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

రూ.30లక్షలకు పైగా రావాలి



గ్రామంలో నూతన పంచాయతీ భవనం, మన ఊరు మనబడి, క్రీడా ప్రాంగణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేశాను. రూ.30లక్షలపైగా ఖర్చు అయింది. ఎంబీలు పూర్తి చేశారు. డబ్బులు మాత్రం రావడం లేదు. అప్పులు కుప్పలు అయ్యాయి. ఏమి చేయాలో తెలియడం లేదు. పదవీకాలం ముగిసి నాలుగు నెలలు కావస్తోంది. సర్పంచుగా ఎన్నికైనందుకు సంతోషించాలో.. అప్పులు చేసి పనులు చేయడం వలన భూములు అమ్ముకోవాల్సి వస్తుందని బాధపడాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలి.

– అంజయ్య, మాజీ సర్పంచ్‌, చంద్రాయన్‌పల్లి

గుట్టుగా గుట్కా దందా!

పోలీసుల దాడులు కొనసాగుతున్నా నిషిద్ధ గుట్కా సరఫరాకు అడ్డుకట్ట పడడం లేదు. పెద్ద ఎత్తున గోదాంలలో నిల్వ ఉంచి గుట్టుచప్పుడు కాకుండా పాన్‌షాపులకు, కిరాణా దుకాణాలకు చేరవేస్తున్నారు.

- కర్ణాటక నుంచి సరిహద్దు ప్రాంతాల మీదుగా సరఫరా
- చైన్‌ సిస్టంతో గ్రామాలకు చేరుతున్న నిషేధిత గుట్కా
- జిల్లా వ్యాప్తంగా ఏజెంట్లు, దళారులు
- పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు



పరిగి: రాష్ట్రంలో గుట్కాల విక్రయాలపై నిషేధం ఉన్నా అక్రమార్కులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. పట్టణం, పల్లె తేడా లేకుండా కిరాణం షాపులు, పాన్‌ డబ్బాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది వ్యాపారులు ఈ దందాను గుట్టుగా కొనసాగిస్తున్నారు. జిల్లాకు కర్ణాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతం ఉండటంతో పక్క రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున గుట్కా అక్రమ రవాణా జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో అక్రమార్కులు ఏకంగా పెద్ద ఎత్తున గోదాముల్లో నిల్వ ఉంచి మరీ దర్జాగా వ్యాపారం సాగిస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జిల్లాల్లో పోలీసులు యంత్రాంగం అడపదడప దాడులు జరిపితే కేవలం పాత్రదారులు పట్టుబడుతుండగా అసలైన సూత్రదారులు మాత్రం దొరకకుండా దందా నడిపిస్తుండటం గమనర్హం.

శివారు ప్రాంతాలే అడ్డాలు

జిల్లాకు ఇతర రాష్ట్రం సరిహద్దులు ఎక్కువగా ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా గుట్కాను తరలిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకున్న నిషేధిత గుట్కాను ఎవరికీ అనుమానం రాకుండా శివారు ప్రాంతాల్లో నిల్వ ఉంచుతున్నట్లు సమాచారం. దుకాణాల్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచితే పట్టుబడే అవకాశం ఉండటంతో ఇలా చేస్తున్నారు. నిల్వ ఉంచిన ప్రదేశం నుంచి అవసరానికి అనుగునంగా గ్రామాలకు వాహనాల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పక్క రాష్ట్రాల్లో గుట్కాపై నిషేధం లేకపోవడంతో అక్రమార్కులకు కలసొచ్చే అంశం. కర్ణాటక రాష్ట్రం నుంచి ఎక్కువగా దిగుమతి చేస్తున్నట్లు సమాచారం.

చైన్‌సిస్టంలో గుట్కా దందా

గుట్కా మాఫియా చైన్‌ సిస్టంలా ఈ దందా నడిపిస్తోంది. అనుమతులున్న వస్తువులతో కలిపి వాహనాల్లో పక్క రాష్ట్రం నుంచి జిల్లాకు తీసుకువస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన వ్యక్తి మరో దళారికి చేరవేస్తాడు. ఆయన గ్రామాల వారీగా ఏజెంట్లను పెట్టుకుని వ్యాపారం నడిపిస్తున్నాడు. వారు పట్టణ, గ్రామాల్లోని కిరాణా షాపులు, పాన్‌ డబ్బాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా జిల్లాలో అన్నిగ్రామాల్లో నిషేధిత గుట్కా దర్జాగా అమ్ముతూ అక్రమార్జనలకు పాల్పడుతున్నారు. పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. కర్ణాటక నుంచి పరిగి మీదుగా షాద్‌నగర్‌, హైదరాబాద్‌కు నిత్యం కోట్ల రూపాయల గుట్కా సరఫరా అవుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


యాలాల: ఆవు కళేబరం వద్ద రైతు నర్సిరెడ్డి

యాలాల: తెగిన విద్యుత్‌ తీగ తగలి ఓ ఆవు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని అన్నసాగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పట్లోళ్ల నర్సిరెడ్డి మేత కోసం ఆవును గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. నాగసముందర్‌ శివారులో మేస్తుండగా తెగిన విద్యుత్‌ తీగలడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని పంచనామా చేశారు. ఆవు విలువ రూ.50వేల విలువ ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితరైతు కోరుతున్నాడు.

తంగెళ్లపల్లిలో ఎద్దు..

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తంగెళ్లపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బెస్త చంద్రయ్య ఎద్దు మంగళవారం మేత మేస్తుండగా 11 కేవీ విద్యుత్‌ వైర్లు తగిలాయి. దీంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఎద్దు విలువు సుమారు రూ.80వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు. ఈ విషయమై ఏఈ రవి కుమార్‌ను వివరణ కోరగా బాధిత రైతుకు నష్ట పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. లూజ్‌ లైన్‌ను వెంటనే సరిచేయిస్తామన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ..

కేశంపేట: మండల పరిధిలోని సంగెంలో వీధికుక్కల బెడద తీవ్రమైందని గ్రామస్తులు తెలిపారు. చెత్త డంపింగ్‌ యార్డులో ఆహార పదార్థాలను తినేందుకు వెళ్తున్న కుక్కలు రాత్రి వేళ సమీపంలో పశువుల పాకలపై దాడి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన కందూరు సత్తయ్యకు చెందిన లేగదూడపై దాడి చేయండంతో మృత్యువాత పడింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- కానిస్టేబుల్‌పై గొడ్డలితో దాడికి యత్నం
- ముగ్గురిపై కేసు నమోదు
- పరారీలో మరో వ్యక్తి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్‌కుమార్‌

యాలాల: మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. విషయం తెలుసుకుని అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌పై గొడ్డలితో దాడికి యత్నించి దురుసుగా ప్రవర్తించారు. ఈ సంఘటన మండల పరిధిలోని బాగాయిపల్లి చౌరస్తాలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. తాండూరు రూరల్‌ సీఐ అశోక్‌ కుమార్‌ తెలిపిన ప్రకారం.. విధుల్లో భాగంగా బ్లూకోట్‌ కానిస్టేబుళ్లు నరేశ్‌, వెంకటేశ్‌ పెట్రోలింగ్‌ చేస్తూ బాగాయిపల్లి చౌరస్తాకు వచ్చారు. చౌరస్తాలో కొంతమంది ద్విచక్రవాహనదారులు గొడవపడుతుండగా కానిస్టేబుళ్లు వారిని నచ్చజెప్పి పంపించారు. కాగా మద్యం మత్తులో ఉన్న తాండూరు మండలం చెంగోలుకు చెందిన రాంచందర్‌, విజయ్‌కుమార్‌, నరసింహులు, పెద్దేముల్‌ మండలం నాగులపల్లికి చెందిన పవన్‌కుమార్‌ కానిస్టేబుళ్లతో దుర్భాషలాడుతూ వాదనకు దిగారు. పవన్‌కుమార్‌ యువకుడు సమీపంలో ఉన్న గొడ్డలితో కానిస్టేబుళ్లపై దాడికి యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. కానిస్టేబుళ్లతో వాదనకు దిగిన రాంచందర్‌ అనే వ్యక్తిని కానిస్టేబుళ్లు బ్రీత్‌ అనలైజర్‌తో పరీక్షించడానికి యత్నించగా, బ్రీత్‌ అనలైజర్‌ను విరగ్గొట్టి కానిస్టేబుళ్లను దుర్భాషలాడినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు విషయమై కానిస్టేబుల్‌పై గొడ్డలితో దాడికి యత్నించిన పవన్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురిపై యాలాల పీఎస్‌లో కేసు నమోదు చేశామన్నారు. నలుగురు నిందితులలో నరసింహులు పరారీలో ఉన్నాడన్నారు. ఈ ఘటనకు సంబంధించిన నరసింహులు సోమవారం తాండూరులో మీడియాతో మాట్లాడుతూ పోలీసులే తనపై దాడి చేశారని తప్పుడు సమాచారం ఇచ్చాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు


మాట్లాడుతున్న డీఐఓ శంకర్‌

ఇంటర్మీడియెట్‌ జిల్లా నోడల్‌ అధికారి శంకర్‌

అనంతగిరి: అడ్వాన్స్‌ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియెట్‌ జిల్లా నోడల్‌ అధికారి ఎస్‌.శంకర్‌ తెలిపారు. మంగళవారం వికారాబాద్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో చీఫ్‌ సూపరింటెండెంట్స్‌, అడిషనల్‌ చీఫ్‌ సూపరింటెండెంట్స్‌, డిపార్ట్‌మెంటల్‌ ఆఫీసర్లు, కస్టోడియన్లు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, సిట్టింగ్‌ స్క్వాడ్‌లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌ మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో మౌలిక వసతుల కల్పనతో పాటు తాగునీరు, నిరంతర విద్యుత్‌ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 4,621 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 3,210 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్స్‌, వాచ్‌లు, ఎలక్ట్రానిక్‌ వస్తులకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ విధించి పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్‌ కేంద్రాలను పరీక్ష సమయంలో మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మెడికల్‌ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి


మాట్లాడుతున్న నిత్యారెడ్డి

మంచాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వతసులు కల్పించాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు, స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన స్టాండింగ్‌ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిత్యారెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, టాయిలెట్స్‌, విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని కోరారు. గర్ల్‌ చైల్డ్‌ ఎడ్యుకేషన్‌, బాల్యవివాహాలు తదితర అంశాలపై చర్చించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. టైలరింగ్‌, కంప్యూటర్‌ ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కొడంగల్‌ ఏడీఏ శంకర్‌రాథోడ్‌


ఫర్టిలైజర్‌ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ తదితరులు

పరిగి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కొడంగల్‌ ఏడీఏ శంకర్‌రాథోడ్‌ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పలు ఫర్టిలైజర్‌ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్‌లు లేకుండా విత్తనాలు విక్రయించినా వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో, పట్టణాల్లో కల్తీ విత్తనాలు అరికట్టేందుకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరమన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తుంటే వెంటనే పోలీసులకు, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. నిత్యం అన్ని దుకాణాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఫర్టిలైజర్‌ దుకాణాల్లో ఎవరైన నిషేధిత మందులు కాని, నకిలీ విత్తనాలు కాని విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే వారిపై చట్టరపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టులోపు రైతు రుణమాఫీ

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

నందిగామ: రైతాంగానికి ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.పదిలక్షల వరకు పెంచిందన్నారు, రైతుబంధు పంపిణీ చేసిందన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. దివంగత ప్రధాని రాజీవ్‌ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అంతిరెడ్డిగూడ శివారులోని ఈదుల ఎల్లమ్మ ఆలయంలో, వెంకమ్మగూడలో ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నర్సప్పగూడలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌ రెడ్డి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్‌, మాజీ ఎంపీపీ శివశంకర్‌ గౌడ్‌, ఎంపీటీసీ సభ్యులు చంద్రపాల్‌ రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్‌, మాజీ సర్పంచ్‌ కావలి కృష్ణ, నాయకులు రాంరెడ్డి, బాల్‌రెడ్డి, తుమ్మల నర్సింహ యాదవ్‌, లింగం, బాల్‌రాజ్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పంట అమ్మడమే కష్టం

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగబడులు : ఏజీవర్సిటీ పరిశోధన సంచాలకుడు రఘురామిరెడ్డి


సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

ఏజీవర్సిటీ: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంటలు పండించడం కన్నా సరైన సమయంలో సరైన ధరలకు విక్రయించడమే కష్టంగా మారిందని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు పి. రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో అమ్మకందారులు–కొనుగోలుదారుల సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు, రైతు ఉత్పత్తి సంఘాల వారు వీలైనంతవరకు పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధునాతన టెక్నాలజీని వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల్ని సరైన సమయంలో సరైన విధంగా మార్కెట్లో అమ్ముకోవడం ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అని అన్నారు. ఇతర పరిశ్రమల్లో అధిక ఉత్పత్తి చేసినప్పుడు బోనస్‌ లభిస్తుందని కాని వ్యవసాయ రంగంలో ఒక్కోసారి అధిక ఉత్పత్తి కారణంగా నష్టాలు భరించాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పండించిన పంటలను వృథాగా నేలపాలు చేయాల్సి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరగా పాడైపోయే టమాటలు, పూలు, కూరగాయలు వంటి ఉత్పత్తుల మార్కెటింగ్‌ జఠిలమైన సమస్య అని ఆయనన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ ఉత్పత్తు సంఘాలు కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు. ముఖ్యంగా కొనుగోలుదారులు కొనుగోలు చేసే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల్ని ఎక్కడ పండించారు, ఎరువులు పురుగుమందుల్ని ఏ మేరకు వినియోగించారనే అంశాలపై వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రైతులు ఈ విషయాన్ని గమనించాలని వారు సూచించారు. రాష్ట్ర మార్కెటింగ్‌ శాఖ సంచాలకులు జి. లక్ష్మీబాయి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యత వైవిధ్యం స్వచ్ఛతలకు ప్రాధాన మిస్తే మార్కెట్‌ చేసుకోవడం సులువు అవుతుందని వివరించారు. మార్కెటింగ్‌ శాఖ రైతులకు వీలున్నంత వరకు సేవలు అందిస్తున్నామన్నారు. రైతులు తమ ఉత్పత్తులు శుభం చేయడం గ్రేడింగ్‌, ఎండబెట్టడం వంటి అంశాల పైన ప్రత్యేక దృష్టి పెడితే మంచి మంచి ధరలు లభిస్తాయని లక్ష్మీబాయి వివరించారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల్ని ఆరు నెలలపాటు తమ శాఖ గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవడానికి కూడా ఒక పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్‌ జిల్లాలకు చెందిన 10 ఉత్పత్తిదారుల సంఘాల రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. నాబార్డ్‌ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్‌ సీమ, వి సుధారాణి, ఐసీఏఆర్‌ డైరెక్టర్‌ రామన్‌ మీనాక్షి సుందరం, విస్తరణ విద్యా సంస్థ సంచాలకులు జగన్‌ మోహన్‌ రెడ్డి, నాబార్డ్‌ ప్రతినిధి వినయ్‌కుమార్‌, ప్రాజెక్టు ప్రిన్సిపాల్‌ మధుబాబు, రైతులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు..

అనుమానంతో ప్రశ్నించిన భార్యను చంపిన భర్త

ఉప్పల్‌: ఉప్పల్‌ ఎస్‌బీఐ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భర్తపై ఉన్న అనుమానంతో ప్రశ్నించినందుకు అర్ధరాత్రి భార్య గొంతుపై కాలు పెట్టి తొక్కి అతి దారుణంగా హత్య చేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడో కిరాతకుడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం లింగంపల్లి ప్రాంతానికి చెందిన భూక్యా రమేష్‌, కొండాపూర్‌ దుబ్బ తండాకు చెందిన భూక్యా కమలకు 2016లో వివాహం జరిగింది. బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి ఉప్పల్‌ ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు నానమ్మ ఇంటికి వెళ్లారు. కాగా గత కొంత కాలంగా భర్త రమేష్‌ వ్యవహారం అనుమానాస్పదంగా కన్పించడంతో..వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని కమల అనుమానించింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు నిలదీసి పంచాయితీ కూడ పెట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య గొడవ మొదలయింది. అనంతరం ఇద్దరు కలిసి ఇంటికి తాళం పెట్టి బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చారు. రాత్రి వీరిద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగి..రమేశ్‌ భార్య తలపై కొట్టడంతో కింద పడిపోయింది. వెంటనే ఆమె గొంతు మీద కాలు పెట్టి తొక్కి..చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత పోలీస్‌ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కమల హత్య వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం ఉదయం ఉప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌ వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.